# జనారణ్యంలో ఎడారి కోయిల

అటు తూరుపు వాకిట్లో కరకర పొద్దు పొడుస్తూంటే ఇటు పడమటి గుమ్మం లోంచి "బన్ను, సమోసా, బిస్కెట్లు..." అంటూ మల్లేశం గొంతు మంద్ర స్వరంలో వినబడుతుంది. అందుకోసమే ఆబగా ఎదిరిచూస్తున్న పిల్లలు, వాళ్ళమ్మలు బెల్లం చుట్టూ ఈగల్లా అతణ్ని చుట్టేస్తారు. ఎవరిక్కావల్సినవి వారు చకచకా కొనుక్కుంటారు. మా ఇంటి అరుగు కాస్సేపు అంగడి బజారైపోతుంది. అదో చూడముచ్చటైన సన్నివేశము.

బొండు మల్లెలాంటి తెల్లని దోవతి, సిల్కు లాల్చీ రెండుచేతుల్లో వేలాడుతున్న పెద్ద సైజు ప్లాస్టిక్ సంచులు, సంచుల కడుపుల్లో బన్నులు, సమోసాలు, బేకరీ బిస్కెట్లు లాంటి తాజా సరుకులుంటాయి. రెండు చేతుల్లో సంచులు మోస్తూ అరవై దాటిన మల్లేశం ఇరవయ్యేళ్ల కుర్రాడిలా నడిచొస్తుంటే మొదటిసారి చూసినవారి మొహాలు విచిత్ర చిత్రాలైపోతాయి.

"నీకేం కావాలి పాపా?"

నీకేం కావాలి బాబూ?"

ఆప్యాయంగా పలుకరిస్తూ పిల్లల నున్నని బుగ్గల్ని ప్రేమగా నిమురుతూ పరవశించి పోతాడు. పిల్లల్లో తానూ ఓ పిల్లాడై సరుకులమ్ముకుని చక్కా వెళ్లిపోతాడు.

సాయంత్రం అదే మల్లేశం అవే సంచులతో కన్పిస్తాడు. పాంటు-షర్టు, బూట్లు డ్రెస్సులో మెయిన్ రోడ్డు మీద మౌనంగా నడుస్తుంటాడు. సంచుల్లో రింగులు, కొరడాలు, పప్పు, పూసలాంటి ప్యాక్డ్ ఫుడ్స్ సాయంత్రం అల్పాహారానికి పనికొచ్చేవి వుంటాయి. దుకాణాలు, షోరూములు, షాపింగ్ కాంప్లెక్సులు తిరుగుతూ యజమానుల్ని జంటిల్‌మెన్‌లా పలుకరిస్తూ అమ్ముతుండాటు. అన్నీ ప్యాకెట్లే కాబట్టి అవస్త తక్కువ. ఉదయం కన్పించే వృద్ధాప్య ఛాయ లతన్లో సాయంత్రం గోచరించవు. దానిక్కారణం - ఉదయం నూటికి నూరుపాళ్ల తెలుగువాడై అసలు రూపములో కన్పిస్తాడు. సాయంత్రం ఆధునిక నాగరికతలో పాంటు షర్టు డ్రెస్సులో చలాకీగా కనబడ్తాడు. సాయంత్రం మాటలు తక్కువ, అమ్మకాలెక్కువ. అతణ్ని పరిశీలనగా చూస్తుంటే రవీంద్ర కవీంద్రుని రచనల్లోని పోస్ట్‌మెన్ గుర్తుకొస్తాడు.

జీవన సంధ్యా సమయములో ఈయన కెందుకీ అవస్త? అదే అతన్నడిగితే ఓ చిన్నపాటి చిరునవ్వు విసిరేస్తాడంతే. మొహమ్మీద ఆందోళనా ఛాయలేవీ మచ్చుకైనా కనబడవు. ఆ సీనియర్ సిటిజన్ అంతరంగ ధ్వనులను పసికట్టాలనే ఆరాటం నాలో రోజురోజుకూ బలం పుంజుకుంటోంది.

ఆ రోజు అక్టోబర్ రెండు. గ్రామ స్వరాజ్యం కోసం తెల్లదొరల నెదిరించిన మహాత్మాగాంధీజీ జయంతి. నాలాగా నెల జీతాన్ని నమ్ముకున్న వాళ్లందరికీ జాతీయ సెలవుదినము. సెలవు నాడు బారెడు పొద్దెక్కేదాకా బద్ధకం వదలదు. కానీ... కావాలనే ఆ రోజు ఎప్పట్లాగే నిద్రలేచి మల్లేశం కోసం నేను కూడా అరుగుమీద ఎదురుచూస్తున్నాను. రోజుట్లాగే వచ్చి చిలకపలుకులతో తనపని ముగించుకున్నాడు. అరుగు మీదున్న సంచుల్ని చేతుల్లోకి తీసుకోబోతున్నాడు. అనుకోకుండా ముసురుకున్న సిగ్గుల చిక్కుల్లో ఇరుక్కోకుండా

"నీతో కొంచెం మాట్లాడాలనుంది" అన్నాను ధైర్యంగా.

సంచులనక్కడే వదిలేసి నన్ను కింద నుంచి మీద్దాకా పరిశీలనగా చూశాడు. నాతో కీకేంపని? అన్నట్టు ఉన్నాయాచూపులు.

"ఆహా! పనేమీ లేదు గాని నీతో కాస్సేపు మాట్లాడాలనుంది మల్లేశం" సర్దుకుని వివరణ ఇచ్చాను.

"ఇప్పుడు కుదరదు సార్! కావాలంటే మధ్యాహ్నం రెండింటి కొస్తా!" నవ్వుతూ సంచులందుకున్నాడు.

"తప్పకుండా వస్తావు గదూ!"

"తప్పకుండా వస్తా సార్!"

xxxxx

"చెప్పండి సార్! ఏదో మాట్లాడాలన్నారు". ఠంచన్‌గా రెండింటికి తెల్లలుంగీ, గళ్ల షర్టు మీదొచ్చిన మల్లేశం కళ్లల్లో అనుమానం ఛాయలున్నాయి. అంతరాళాల్లోని అసక్తి పొంగుల నదిమిపెట్టి "కూచో!" కుర్చీచూపించాను.

"నేను భోంచేశాను. మీ భోజనమైందా సార్?" అంటూ నాకెదురుగా కుర్చీలో మర్యాదగా కూచున్నాడు. సీలింగ్ ఫ్యాన్ గాలికి తెల్లబారుతున్న జుట్టు లయబద్ధంగా కదుల్తోంది.

"భోంచేశాను" కాళ్లు కుర్చీలోకి ముడుచుకున్నాను.

నా అర్ధాంగి చాయ కప్పుల్తో ప్రత్యక్షమైంది. మాకు చెరోటి అందించి, తానో కప్పుతో నా పక్క కుర్చీ నాక్రమించింది.

"చూడబోతే బాగా బతికినట్టుంది. ఈ వయసులో ఎందుకు కష్టపడుతున్నా?" ఉపోద్ఘాతమేదీ లేకుండా నేరుగా విషయ ప్రస్తావన చేశాను.

గరం చాయలో ఏముందో గాని అది కడుపులోకి జారుతూంటే పట్టుదప్పిన నరాలు సర్దుకుని శక్తి సంగీతాన్నాలా పిస్తున్నాయి. మల్లేశం చూపులు ఎదురు గోడ మీదున్న పార్థసారథి చిత్రమ్మీదున్నాయి. రెండు నిమిషాలు చాయలో కరిగాయి. అతని మొహం గాంభీర్యాన్ని పులుముకుంది.

"దానికి జవాబివ్వాలంటే ముందుగా నా గతాన్ని మీరు ఓపిగ్గా వినాలి సార్!" ఖాళీ కప్పును టీపాయ్ కప్పగించాడు.

"తప్పకుండా!" కుర్చీలో ముడుచుకుపోయాను.

"నేను పల్లెలో పుట్టి, పొలాల మధ్య పెరిగాను. మాది జమీందారీ కుటుంబము. వంశపారపర్యంగా వస్తున్న అట్టహాసాన్ననుభవిస్తూ మా నాన్న ఊరి జనాలను అమానుషంగా అజమాయిషీ చేసేవాడు. ఊళ్లో ఏ తగాదా వచ్చినా నాన్న పరిష్కరించాల్సిందే. కాలం మారిపోతుంది. ప్రజలు చైతన్యవంతులవుతున్నారు. కొంతకాలం తీవ్రవాదుల పటాటోపం సాగింది గదా! వాళ్లు పల్లెల్లోని జమీందార్లు, దేశ్‌ముఖ్‌ల వెంటబడ్డారు. వాళ్లను వర్గశత్రువులుగా చిత్రించారు గదా! మా వ్యవసాయ భూమిలో ఎర్రజండాలు పాతారు. ప్రతిఘటించిన మా నాన్నను మా ముందే నరికేశారు. ఆ దారుణ మారణకాండతో మా గుండెల్లో బాంబులు పేలినై. నాన్న రక్తంతో మా భూమి తడిసిపోయింది. ఆ భూమిని వాళ్లకే వదిలేసి మిగతా భూమి, ఇల్లు అమ్ముకుని

పట్నమొచ్చినం. మా ఇద్దరక్కయ్యలకూ, నాకు అప్పటికే పెళ్ళిళ్ళై పోయినై. ఇక్కడే ఓ బంగళా కొనుక్కొని బతుకు దెరువు కోసం ఎరువుల వ్యాపారంలోకి దిగాను. ఓ రైసు మిల్లులో భాగస్వామినయ్యాను. ఓ సంవత్సరం తేడాతో ఒకబ్బాయి, ఒకమ్మాయి జన్మించారు. పిల్లలే సర్వస్వమనుకొని గారాబంగా గుండెలమీదాడించాను. వాళ్ల భవిష్యత్తనుకున్నాను. అందుకే రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించాను. చిన్నపట్నుంచే ఖరీదైన చదువు చెప్పించాను.

ఎండాకాలం సెలవుల్లో స్పెషల్ కోచింగుల కోసం హాస్టల్లోనే ఉండేవారు. ఓ సంవత్సరములో వాళ్లు మాతో పది రోజులకంటే ఎక్కువుండే వారు కాదు. కన్న కడుపు తీపితో వాళ్ళమ్మ

"కన్న పిల్లల్ని ఎక్కడో వదిలేసి లింగు లిటుకు మంటూ ఇంట్లో మనిద్దరమే ఉంటున్నాము. ఆస్తులు అమ్మేస్తూ అంతంత ఫీజులు కట్టే బదులు మన దగ్గరే ఉంచుకుని మంచి స్కూల్లో చదివిస్తే బాగుంటుంది కదా!" బాధపడేది. నేనేమో "పిల్లలు మన కళ్ల ముందుండాలని, వాళ్లతో కులాసాగా గడపాలని నాకు మాత్రం లేదా! కాని వాళ్ల బంగారు భవిష్యత్తు కోసం మనమీ ఎడబాటును భరించక తప్పదు. పిల్లలు ప్రయోజకులైతే మనల్ని పువ్వుల్లో పెట్టి పూజిస్తారు తెలుసా!" సముదాయించే వాణ్ని. నెలకోసారి మేమే వెళ్లి చూసొచ్చే వాళ్లం. నష్టం రావడంతో ఎరువుల వ్యాపారం మూలకు పడింది. మేమనుకున్నట్టుగా పిల్లలిద్దరు బాగా చదువుకున్నారు. అమెరికా అబ్బాయికిచ్చి అమ్మాయి పెళ్లి ఘనంగా చేశాను. మా అమ్మాయికి కూడా అక్కడే ఉద్యోగం దొరికింది. కొడుకును ఆస్ట్రేలియా పంపేందుకు నా రైసుమిల్లు భాగస్వామ్యాన్ని అమ్మేశాను. వానిగ్గూడా ఆస్ట్రేలియాలోనే ఉద్యోగం దొరికింది. అప్పటికి ఇల్లు తప్ప మాకింకేమీ మిగల్లేదు...." ఆఫ్ చేసిన ఫ్యాన్‌లా ఆగిపోయాడు.

"ఐతే ఏమైంది? కొడుకు బాగా డబ్బు పంపాడా?" ఆతృతనాపుకోలేక అడిగాను.

"వాడు ప్రయోజకుడై సంపాదించి డబ్బు పంపిస్తాడనే ఆశతోనే ఆస్తులమ్మేశాను. వాడు పంపించిన డబ్బుతో మరో రైసుమిల్లు కొందామనుకున్నాను. మంచి సంబంధం చూసి వానికి పెళ్లి చెయ్యాలనుకున్నాను. ఓ పదేళ్లు అక్కడే ఉండి దండిగా డబ్బులు కూడ బెట్టుకుని తిరిగొస్తాడనీ, వాని భార్యా పిల్లల్తో ఇల్లు కళకళలాడ్తుంటే చూసి మురిసి పోవాలని కలులు కన్నాము."

"అవన్నీ సమజమే గదా!"

"నిజమే కానీ అదృష్టవంతులకే సాధ్యమవుతుంది సార్!"

"ఎందుకట్లా?" నా భృకుటి ముడి పడింది.

"వాడు విదేశానికెళ్లినప్పట్నుంచి ఒక్కరూపాయి గూడా పంపలేదు. అడుగుదామంటే అభిమానం అడ్డొచ్చింది. రానురాను ఇల్లు గడవడమే కష్టమైంది. డబ్బులడుగు తామేమోనని కావచ్చు వాడు ఫోన్ గూడా చెయ్యలేదు. అభిమానం ఆకలిని తీర్చలేదు గదా! దాన్ని మింగేసి వాళ్లమ్మ ఫోన్‌లో "బాబూ! మీ నాన్నగారిప్పుడేమీ సంపాదించడములేదు గదా! ఫోన్ బిల్లుగ్గూడా అప్పు చెయ్యాల్సివస్తుంది. నువు వెంటనే కొంత డబ్బు పంపించు" మని దేవిరించింది. వెంటనే ఫోన్ కట్టైపోయింది. మా ఆప్యాయతానుబంధం కూడా తెగిపోయింది. దాంతో వాళ్లమ్మ పులిగాండ్రింపు విన్న మేక పిల్లలా వణికిపోయింది.

"గుండెల మీదాడుకున్న కొడుకు గుండెల మీద తంతాడనుకోలేదు..." పసి పాపలా వెక్కివెక్కి ఏడ్చింది. మనోవేదనతో మంచమెక్కింది. అప్పటికే అప్పుల కుప్పలు పెరిగిపోయినై. ఆమె రోజు రోజుకు

క్షీణించసాగింది. స్పెషలిస్టు డాక్టర్ పరీక్షలో అది గుండె జబ్బని తేలింది. బాధా ప్రవాహాన్ని తట్టుకోలేని గుండెకు ఆపరేషన్ తప్పదన్నారు. అన్నానికే లేనివాడు ఆపరేషన్ కోసం రెండు లక్షలెలా తేవాలి? బంగళా తాకట్టు పెట్టి ఆపరేషన్ చేయించాను. ఆ సంగతి కొడుక్కు ఫోన్‌లో చెప్పినా పట్టించుకోలేదు.

ఆమె ఆరోగ్యం కుదుటబడింది. డిస్చార్జి చేస్తూ డాక్టర్ " ఆమెకు ఆందోళన కలిగించే వార్తలేవీ చెప్పవద్దు. వాతావరణం ప్రశాంతంగా ఉండాలి." మరెన్నో జాగ్రత్తలు చెప్పాడు. ఆ విషయాలన్నీ కొడుక్కు ఫోన్‌లో చెప్పి

"బాబూ! నీ పెళ్లివేడుక కళ్లారా చూడాలనుంది అమ్మకు, నువ్వు త్వరగా వచ్చెయ్. నీకు నచ్చిన అమ్మాయితో పెళ్లి చేస్తా. అప్పుడన్నా మీ అమ్మ మనసు ప్రశాంతమవుతుంది" అన్నాను. వాడు సినిమాలో విలన్‌లా నవ్వి "నాకెప్పుడో పెళ్లయిపోయింది డాడీ" చావు కబురు కఠోరంగా చెప్పాడు.

ఆ సంగతి నా భార్యకు సౌమ్యంగా చెప్పాను. ఆమె "అయ్యో!" అంటూ కుప్ప కూలిపోయింది. ఒడ్డుకేసిన చేపపిల్లలా కాళ్లూ చేతులు కొట్టుకుంటూ గుండె నొప్పితో మెలికలు తిరిగిపోయింది. హాస్పిటల్‌కు తీసుకెళ్లేలోగా అంతా అయిపోయింది. ముప్పైయ్యేళ్లు తోడూనీడగా నడిచిన అర్థాంగి నన్ను ఒంటరివాణ్ని చేసి తనలోకాలకు తాను వెళ్లిపోయింది.

నా బతుకును కుక్కలు చింపిన విస్తరిలా చేసిన కొడుక్కీ విషయం చెప్పాలన్పించలేదు. కూతుర్ని ఫోన్‌లో పలుకరించి "మీ అమ్మ హార్ట్ ఎటాక్‌తో చనిపోయిందమ్మా" అంటూ బావురుమన్నాను. కూతురేమో.

"సారీ డాడీ! నా హస్బెండ్ నాకు విడాకులిచ్చి మరో పెళ్లి చేసుకున్నాడు. నేను కూడా మరో పెళ్లి చేసుకునే ప్రయత్నంలో ఉన్నాను. కావాలంటే నువు గూడా సెకండ్ మ్యారేజి చేస్కో" అనేసి ఫోన్ పెట్టేసింది.

భగవంతుడా ఇంటి నిండా నౌకర్ల సేవలతో రాకుమారుడిలా పెరిగిన నాకీ గతి పట్టించావా? నా పిల్లలకు నేనేం తక్కువ చేశాను? పెద్ద చదువులు చదివించాను. పూర్తి స్వేచ్ఛనిచ్చాను. ఇంటికి దూరంగా పెరిగిన కారణంగా ఇంగితజ్ఞానం అబ్బలేదేమో... అనుకుంటూ గుండెగోడల్ని ఒరుసుకుంటూ ఎగదన్ను కొస్తున్న దుఃఖాన్నాపుకోలేక తనివిదీరా ఏడ్చాను.

మానవ సంబంధాలు మటుమాయమవుతున్న ఈ యాంత్రిక యుగంలో భారతీయ ధర్మాలెటు పోతున్నాయి?... నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను. మిత్రులు సానుభూతి వెలిబుచ్చారు. సాయం చేస్తామని ముందుకొచ్చారు. కాని ఇతరుల సాయంతో బతకడం నాకేమాత్రం ఇష్టం లేదు. బొందిలో ప్రాణాలున్నంత వరకు స్వేచ్ఛా విహంగములా గుండాలనుకున్నాను. తాకట్టు పెట్టిన బంగళాను అమ్మేశాను. మిగిలిన డబ్బుతో ఇప్పుడుంటున్న పెంకుటిల్లు కొన్నాను. వైధవ్యం కంటే వైపత్నీకం ఘోరమని అనుభవం ద్వారా తెలిసింది. ఒంటరితనం సతాయిస్తున్నప్పుడు ఇరుగు పొరుగు వారితో బాతాకానీ కొడుతూ పొద్దు పుచ్చుకుంటున్నాను" గట్టిగా ఊపిరి పీల్చుకుని కుర్చీ వెనక్కు ఒరిగాడు.

నన్నేదో మాయాజాలం అలుముకున్నట్టుంది. నా భార్య ముక్కుమీద వేలేసుకునుంది. "అంత దుఃఖాన్ని ఎట్లా మరిచిన వన్నా?" ఆప్యాయంగా అడిగింది.

సముద్ర గర్భంలో ఈదులాడుతూ పైకి తేలుతున్నట్టుంది మల్లేశం వాలకం. నిట్టూర్పు విడిచి ముందుకు వంగాడు.

"కాలగమనమే మనసు గాయానికి మలాములా పంజేస్తుందమ్మా. భారమంతా భగవంతుని మీదేసి ఆత్మస్థైర్యం కూడదీసుకున్నాను. యోగా నేర్చుకున్నాను. రోజు ఉదయం గంట సేపు ప్రాణాయామం యోగాభ్యాసం చేస్తున్నాను. దాంతోనే గుండె గుండ్రాయైంది. నా భార్యతో సుఖంగా గడిపిన తీపి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ మానసికానందాన్ననుభవిస్తున్నాను. చచ్చేదాకా ఆరోగ్యంగా ఉండాలనుకుంటున్నాను.

"సరేగానీ..." నా భార్యనే అందుకుంది. "ఏపాటు తప్పినా సాపాటు తప్పదు గదా, పొట్ట గడవడం... ఎలా? మాటల్లో సానుభూతి జాలువారింది.

"దాందేముందమ్మా! పొట్టకూటికి జెర్రిపోతులనాడించినట్టు నిజాయితీగా బతకడానికెన్నో మార్గాలున్నాయి. నిజాయితీతో ఆస్తులు కూడబెట్టకపోవచ్చు గానీ అన్నానికి కొదవుండదు."

"అంటే...!" ట్రాన్స్‌లోంచి నేనూ బయటికొస్తున్నాను. "రోజువారీ కార్యక్రమమెట్లుంటుంది?"

మల్లేశం పెదాల మీదో చిరునవ్వు చిందులేసి మాయమైంది.

"రోజూ ఉదయయం నాలుగింటికి నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుంటాను. ఓ గంట సేపు ప్రాణాయామం, యోగాభ్యాసంలో మునిగిపోతా. స్నానం, పూజ ముగించుకుని పాలపాకెట్ విప్పుతా. గ్లాసెడు వేడి పాలు తాగి మిగతావి తోడువేస్తాను. ఆరువరకు హోల్‌సేల్ బేకరి షాపు కెల్తాను. సరుకులు తీసుకుని సంచుల్లో సర్దుకుంటాను. ఆరునుంచి ఏడు దాకా గల్లీలు తిరిగి అమ్ముతా. ఏడు నుంచి ఎనిమిదిన్నర దాకా హాస్పిటల్ ముందు అమ్ముతా. ఆ తర్వాత బేకరీ షాపుకెళ్లి మిగిలిన సరుకులు వాపసిచ్చి నాకు రావల్సిన కమీషన్ తీసుకుని ఇంటికొస్తాను. ఏదో ఓ టిఫిన్ చేసుకుని తింటాను. లైబ్రరీ కెళ్లి వార్తా పత్రికల నాపోసన పడ్తాను. మధ్యాహ్నం వంటచేసుకుని భోంచేస్తాను. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటా, ఇంకేమన్నా పనులుంటే చూసుకుంటా.

తిరిగి సాయంత్రం నాలుగింటికి పాంటూ-షర్టు వేసుకుని హోల్‌సేల్ ప్యాకడ్ ఫుడ్స్ షాపుకెల్తా. సరుకులు సంచుల్లో వేసుకుని బయలుదేరుతా. మెయిన్ రోడ్, షాపింగ్ కాంప్లెక్సులు తిరిగి అమ్ముతాను. నన్ను చూడగానే షాపుల వాళ్లకు సాయంత్రం అల్పాహారం గుర్తుకొస్తుంది. వాళ్లకిష్టమైన ప్యాకెట్లు తీసుకుంటారు. అలా సాయంత్రం ఆరు దాకా తిరుగుతూ మిగిలిన సరుకుల్ని షాపులో తిరిగిచ్చి కమీషన్ జేబులో వేసుకుని ఇంటికిస్తా. కాస్సేపు టీ.వి. తోనో, లైబ్రరీ పుస్తకాలతోనో కాలక్షేపం. అప్పుడప్పుడు ఇరుగు పొరుగు పిల్లల్తో కులాసా కాలక్షేపం... కబుర్లు. రాత్రి తొమ్మిదింటికి రొట్టెలు చేసుకుని తింటా. ఆ తర్వాత నిద్రలోకి జారుకుంటా... ఇదీ నా దినచర్య..."

"అయితే... జనారణ్యంలో ఎడారి కోయిలలా గడుపుతున్నారన్నమాట" అనేశాను. ఆ వృద్ధ యువకుని ఆత్మవిశ్వాసానికి మనసులోనే జోహార్లర్పించాను. మెదడు పొరల్లో ఏవేవో సందేహాలున్నా అతడంటే గౌరవభావమేర్పడింది.

"ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నారు కాబట్టి స్వయంకృసితో రోజులు నెట్టుకొస్తున్నారు. ఈ గొర్రెతోక సంపాదనతో కొంత వెనకేసుకోవడం కష్టమే. ఒకవేళ అనారోగ్యంతో మంచానపడితే ఎట్లా?" లా పాయింట్ లాగుతున్న క్రిమినల్ లాయర్లా అడిగాను.

గంభీరముద్ర దాల్చిన అతని ముఖ కవళికల్ని జాగ్రత్తగా చదివేస్తూ నవ్వబోయి మానేశాను. "అట్లా ఆలోచించే గదా సార్ మన వాళ్లు వృద్ధాప్యములో బలహీనులై పిల్లలకు బానిసలయేది."

"వృద్ధాప్యములో పిల్లల సేవలవసరము గదా! అందుకోసం ముందట్నుంచే జాగ్రత్త పడాలి."

"అట్లా ఆలోచించడమే అసలైన బలహీనత. బతికినన్ని రోజులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. చచ్చింతర్వాత ఏమవుతోందని చావకముందే హడలిపోవడం పిరికిలక్షణం సార్! కానీ... నాది మాత్రం స్వయంకృతం. పసితనం నుండే పిల్లల్ని నాకు దూరంగా పెంచాను. అనురాగాలు, ఆప్యాయతలు, అనుబంధాలంటే ఏమిటో వాళ్లకు తెలీయకుండా చేశాను. చేతులు కాలింతర్వాత ఆకులు పట్టుకున్నా ప్రయోజనం లేదు గదా సార్!" నవ్వేశాడు.

అతని వాదన నిజమే. అలా చూస్తుండి పోయాను. ఇంకేమడగాలో... భావానికి స్పష్టత లేదు. భావానికి తగిన భాష లేదు. నేనూ నవ్వాను.

"టైం మూడున్నరైంది ఇహ నేను వెళ్తా సార్!" హుందాగా లేచి చలాకీగా వెళ్లాడు.

--- × ---

(చేతన, ఫిబ్రవరి-2010)

